నవతెలంగాణ
www.navatelangana.com
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
శుక్రవారం 10 మార్చి 2023

నిత్యం ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ప్రజలు నిత్యం ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని ప్రభుత్వ వైద్యుడు మహేందర్ అన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవ వేడుకలను ప్రభుత్వ ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రంలో నిర్వహించారు. కేక్ కట్ చేసిన అనంతరం మాట్లాడుతూ వ్యాధులపై ప్రజలకు అవగాహన లేకపోవడంతోనే ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోగులు బిపి, షుగర్, వివిధ నొప్పుల నివారణకు సూదులు, అధికంగా మాత్రలు వాడుతుడడంతో కిడ్నీలపై ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. కిడ్నీలు పాడైపోయి ఇబ్బందులు పడుతున్న రోగులకు ఆస్పత్రిలో ఉచితంగా డయాలసిస్ చేస్తున్నామన్నారు. ప్రస్తుతం డయాలిసిస్ చేయించుకుంటూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నిరుపమ, నర్సింగ్ సూపరింటెండెంట్ దుర్గం విమల, సిబ్బంది సుభాష్ బొంకంటి, డయాలసిస్ ఇన్‌చార్జి శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

గిడ్డంగి నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ - వాంకిడి

మండల కేంద్రంలో గురువారం సింగిల్‌విండో గిడ్డంగి నిర్మాణానికి జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు యూరియా, డీఏపీతో పాటు ఇతర సామగ్రిని గిడ్డంగిలో నిల్వ చేసుకోవడానికి నూతన భవనం నిర్మిస్తున్నామని తెలిపారు. రైతులకు గిడ్డంగి అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ విమలాబాయి, జెడ్పీటీసీ అజయ్‌కుమార్, సర్పంచ్ తుకారాం, బంబారా సర్పంచ్ అయూబ్, సరండి సర్పంచ్ కమలాకర్, సింగిల్ విండో చైర్మన్ జాబిరె పెంటు, బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటా జ్వరాలు..!

- జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులతో ఇబ్బందులు
- ప్రతి పది మందిలో ఒకరికి అనారోగ్యం
- ఆస్పత్రుల వద్ద బారులు తీరుతున్న జనాలు
- వాతావరణ మార్పులే కారణమంటున్న వైద్యులు

అంతుచిక్కని వాతావరణం జనాలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. పగలు ఎండ..రాత్రి చల్లని వాతావరణం కారణంగా వివిధ రకాల వ్యాధులు చుట్టుముడుతున్నాయి. ప్రతి పది మందిలో ఒకరు జ్వరంతో బాధపడుతున్నారు. జలుబు, దగ్గు, ఒళ్లునొప్పులతో తీవ్రంగా సతమతమవుతున్నారు. వారం రోజుల పాటు ఈ వ్యాధుల తీవ్రత తగ్గకపోవడంతో ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. పీహెచ్‌సీలు, సామాజిక ఆస్పత్రులతో పాటు పలు ప్రయివేటు ఆస్పత్రులు కూడా రోగులతో కిటకిటలాడుతున్నాయి. గత కొన్ని రోజులుగా రిమ్స్‌లో రోగుల తాకిడి పెరగడం జ్వర తీవ్రతను తెలియజేస్తోంది. ముఖ్యంగా చిన్న పిల్లలను ఈ వ్యాధుల ముప్పు మరింత అధికంగా వెంటాడుతుండటంతో అలక్ష్యం చేయకూడదని వైద్యులు చెబుతున్నారు. వ్యాధి తీవ్రత అధికంగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంటేనే విభిన్న వాతావరణ మార్పులకు నిలయంగా చెబుతుంటారు. ఇక్కడ మూడు కాలాలు దేనికదే పోటీపడుతుంటాయి. ప్రస్తుతం చలి కాలం నుంచి ఎండా కాలానికి మారే క్రమంలో భిన్నమైన వాతావరణ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎండ ప్రభావం తీవ్రంగా ఉండగా.. రాత్రి 7గంటల నుంచి ఉదయం 6గంటల వరకు చలి ప్రభావం ఉంటుంది. దీంతో ఎండా, చలి ప్రభావాల కారణంగా జనాల ఆరోగ్య పరిస్థితి కూడా మారుతోందని నిపుణులు చెబుతున్నారు. తాజా వాతావరణ పరిస్థితుల కారణంగా జ్వరం, జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు, గొంతునొప్పితో పాటు టైఫాయిడ్ వంటి వ్యాధుల బారినపడుతున్నారు. ప్రస్తుతం ప్రతి పది మందిలో ఒకరు ఆయా వ్యాధులతో సతమతమవుతున్నారు. ముఖ్యంగా ఇంట్లో ఒకరికి వస్తే.. మిగతా వారికి త్వరగా సోకుతుండటంతో చాలా వరకు ఇంటిల్లిపాది జ్వరాలతో బాధపడాల్సిన పరిస్థితి వస్తోంది.

కిటకిటలాడుతున్న రిమ్స్ ఓపీ విభాగం



ఆస్పత్రులు కిటకిట..!

జ్వరాల తీవ్రత కారణంగా జిల్లాలోని ప్రభుత్వ ప్రయివేటు ఆస్పత్రులు రోగులతో నిండిపోతున్నాయి. 500పడకల సామర్థ్యం కలిగిన రిమ్స్‌లోనూ పడకలు రోగులతో నిండిపోతున్నాయి. రోజూ వందల సంఖ్యలో జనాలు ఓపీ(బయటి రోగుల) విభాగానికి వైద్యం కోసం వస్తున్నారు. పీహెచ్‌సీల్లో సాధారణ రోజుల్లో రోజూ 30 నుంచి 40 మంది వరకు రోగులు రాగా.. ప్రస్తుతం రోజువారీగా ఈ సంఖ్య 50 నుంచి 60వరకు చేరుతోందని వైద్యులు చెబుతున్నారు. ఇలా అన్ని పీహెచ్‌సీలతో పాటు సామాజిక ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. సమయాని కంటే ముందుగానే ఆస్పత్రుల వద్దకు వచ్చి వరుసలో నిల్చుంటున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలుసుకోవచ్చు. వీటికి తోడు పలు ప్రయివేటు ఆస్పత్రుల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. చిన్న పిల్లల ఆస్పత్రుల్లో రోజూ వందలాది మంది చిన్నారులు వైద్యం కోసం కనిస్తున్నారు. ఎక్కువగా వైరల్ ఫీవర్లు కావడంతో ఐదు రోజుల పాటు చిన్నారులను ఇబ్బందులకు గురిచేస్తోంది. దీంతో వైద్యఆరోగ్యశాఖ అప్రమత్తమవుతోంది. మాస్కులు ధరించడం, వ్యక్తిగత శుభ్రత పాటించడంతో పాటు జాగ్రత్తలు పాటించాలని సూచనలు చేస్తున్నారు. చిన్న పిల్లల పట్ల మరింత జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు.

జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుంది : డా.నరేందర్‌రాథోడ్, డీఎంహెచ్ఓ, ఆదిలాబాద్



వైద్యశాఖ పరంగా జ్వరాల నివారణకు ప్రత్యేక కార్యక్రమం అంటూ ఏదీ చేపట్టడం లేదు. ఇవన్ని సాధారణ జ్వరాలే కావడంతో జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుంది. కోవిడ్‌లో తీసుకున్న మాదిరిగా మాస్కులు ధరించడం, శుభ్రత పాటించడం, భౌతికదూరం పాటించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. గత వారాలతో పోల్చుకుంటే ప్రస్తుతం జ్వరాల తీవ్రత తగ్గుముఖం పట్టింది.

అభివృద్ధి ఓర్వలేక ప్రతిపక్షాల విమర్శలు

నవతెలంగాణ- మంచిర్యాలటౌన్

నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని ఓర్వలేకనే ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేస్తున్నాయని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు మండిపడ్డారు. మున్సిపాలిటీలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. గురువారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ పాత మంచిర్యాల నుండి తోళ్లవాగు వరకు సెంట్రల్ లైటింగ్ సిస్టం, డ్రైనేజీ నిర్మాణం, రోడ్డు వెడల్పు చేపట్టేందుకు సీఎం కేసీఆర్ రూ.15.14కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు. గత నెలలోనే ప్రధాన నాలుగు కూడళ్లలో డివైడర్ల నిర్మాణం చేపట్టేందుకు రూ.27కోట్లు మంజూరయ్యాయన్నారు. పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ మున్సిపాలిటీల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వాలు ఏనాడూ మున్సిపాలిటీలను పట్టించుకోలేదని ఆరోపించారు. ఇంత అభివృద్ధి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై అసత్యపు ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుకోవాలని ప్రతిపక్ష పార్టీలు చూస్తున్నాయని ఎద్దేవా చేశారు. ప్రజా శ్రేయస్సు కోసం మరిన్ని నిధులు వెచ్చించి మున్సిపాలిటీలను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే వెల్లడించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, సింగిల్ విండో చైర్మన్ సందల వెంకటేశ్, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పల్లపు తిరుపతి, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు వసుంధర, హరికృష్ణ, మాదంశెట్టి సత్యనారాయణ, గాదే సత్యం, రవీందర్‌రావు, పోరెడి రాజు, అంకం నరేష్, తాజుద్దీన్, బొలిశెట్టి కిషన్, గొంగల్ల శంకర్ పాల్గొన్నారు.

భారత్ బచావో జాతీయ సదస్సుకు తరలిన ఆదివాసీ, దళిత సంఘాల నాయకులు

నవతెలంగాణ - బెజ్జూర్

ఈ నెల 11, 12 తేదీల్లో న్యూఢిల్లీలో నిర్వహించనున్న భారత్ బచావో కార్యక్రమానికి జిల్లాకు చెందిన ఆదివాసీ, దళిత సంఘాల నాయకులు గురువారం బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘం రాష్ట్ర నాయకులు సోయం చిన్నయ్య మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు గడిచినప్పటికీ దేశంలో ప్రజాస్వామ్యం అమలు కావడం లేదన్నారు. ఐదో షెడ్యూల్ స్వయం ప్రతిపత్తిని కాలరాస్తున్నారన్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరిగిపోతోందని, రైతుల ఆత్మహత్యలు, దళిత, ఆదివాసులపై భౌతికదాడులు, అత్యాచారాలు పెరిగి పోయాయన్నారు. వీటితో పాటు కేంద్రంలో అధికారంలో ఉన్న మతతత్వ పార్టీ బీజేపీ హిందుత్వ ఫాసిజాన్ని అమలు చేస్తూ దేశ ఖనిజ సంపదను పెట్టుబడిదారుల చేతుల్లో పెట్టి పీడిత ప్రజలకు అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. రాజ్యాంగాన్ని రద్దు చేసి మనుస్మృతిని అమలు చేసే కుట్రలు చేస్తున్నారన్నారు. సదస్సుకు బయలుదేరిన వారిలో గోండ్వాన ఆదివాసీ కోయ సంఘం జిల్లా అధ్యక్షుడు తలండి మధుకర్, కుల నిర్మూలన వేదిక రాష్ట్ర కార్యదర్శి కోట ఆనంద్, ప్రాణహిత చేవెళ్ల భూనిర్వాసితుల సంఘం తలండి భిక్షపతి, వివిధ సంఘాల నాయకులు ఆత్రం అరుణ్, ఎంపీటీసీ సాయన్న, సెడ్మక రమేష్, కొడప సత్యవాన్, ఆత్రం పోశన్న, కామెర శంకర్, పొర్తెటి నాగేష్ ఉన్నారు.

ఇంట్లోకి ప్రవేశించిన మతిస్థిమితం లేని వ్యక్తి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని వివేకానందచౌక్ ప్రాంతంలోని గల జనరల్ స్టోర్ వ్యాపారి రమేష్ సోలంకి ఇంట్లోకి మతిస్థిమితం లేని వ్యక్తి ప్రవేశించిన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..రాత్రి 1:30 ప్రాంతంలో కాళ్లకు ప్లాస్టిక్ సంచులు కట్టుకొని చప్పుడు కాకుండా ఓ వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించాడు. పెంపుడు కుక్కలు అరవడంతో రమేష్ కుటుంబ సభ్యులు మేల్కొని వ్యక్తిని పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. పెట్రోలింగ్ ఎస్సై సందీప్ అక్కడికి చేరుకొని వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. వ్యక్తి మతిస్థిమితం లేకుండా ఉండడంతో లారీ ఎక్కించి మహారాష్ట్రకు పంపించారు. ఉదయం ఫిర్యాదు చేయడానికి వెళ్లిన రమేష్ భార్య పావని విషయం తెలుసుకొని పోలీసులను ప్రశ్నించింది. సదరు వ్యక్తి మహారాష్ట్రకు చెందిన వాడుగా భావించి పంపించినట్లు పోలీసులు తెలిపారు. వ్యక్తిని ఆస్పత్రికి పంపించాల్సింది పోయి మహారాష్ట్రకు తరలించడం పట్ల పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

వలలో చిక్కుకుని యువ జాలరి మృతి

నవతెలంగాణ - లోకేశ్వరం



మండలంలోని సాత్‌గాం గ్రామానికి చెందిన జాలరి తోకల నరేష్(26) వలలో చిక్కుకొని మృతి చెందాడు. ఎస్ఐ సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం..నరేష్ ఎప్పటి మాదిరిగానే బుధవారం తెల్లవారుజామున వలలు తీసుకుని గడ్చాంద గ్రామ సమీపంలోని గోదావరి నదిలోకి వెళ్లాడు. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు గ్రామస్తుల సహాయంతో వెతికారు. గోదావరి ఒడ్డున బైక్, దుస్తులు కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు గురువారం సంఘటన స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని బయటకు తీయించారు. నరేష్ చేపల కోసం వేసిన వలలు తీస్తున్న క్రమంలో చేతులకు, కాళ్లకు చుట్టుకోవడంతో ఎటూ కదల్లేని స్థితిలో నీటిలో మునిగి ఊపిరాడక చనిపోయాడు. భార్య హరీష ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

కూతురు కోసం వెళ్లి...

లోకేశ్వరం : కూతురుని పుట్టింటికి తీసుకురావడానికి వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం..లోకేశ్వరం గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్(57) కూతురు లాల్‌బీని తీసుకురావడానికి మంగళవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై నిర్మల్ వెళ్లాడు. కూతురుతో తిరిగి వచ్చే వస్తున్న క్రమంలో అర్లి(కె) వంతెనపై గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో తండ్రి, కూతురుకు తీవ్ర గాయాలయ్యారు. స్థానికులు వెంటనే 108లో భైంసా ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే షేక్ హుస్సేన్ పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు నిజమాబాద్‌లోని మనోరమ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ప్రీ బిడ్ సమావేశంలో సందేహాలు నివృత్తి చేసుకోవాలి

- ఆదిలాబాద్ అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



ఆదిలాబాద్‌రూరల్ : నేడు జరగనున్న రాజీవ్ స్వగృహ ప్లాట్ల ప్రీ బీడ్ సమావేశంలో పాల్గొని సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం మావల మండలం బట్టి సావర్గాం శివారులోని రాజీవ్ స్వగృహ ప్లాట్లను, పనుల నిర్వహణను ఆర్డీఓతో కలిసి ఆయన పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అగ్రజ టౌన్ షిప్‌లో 26 ఎకరాల విస్తీర్ణంలో 362 ప్లాట్‌లను గత నవంబర్ మాసంలో బహిరంగ వేలం నిర్వహిచడం జరిగిందని, ఔత్సాహికులు వేలంపాటలో పాల్గొని ప్లాట్లను సొంతం చేసుకున్నారని తెలిపారు. 58 ప్లాట్లకు సంబంధించిన వేలంపాట దారులు డబ్బులు సకాలంలో చెల్లించని కారణంగా ఆ ప్లాట్లను తిరిగి బహిరంగ వేలం వేయడానికి నిర్ణయించామని తెలిపారు. బహిరంగ వేలం నేపథ్యంలో ఈ నెల 10న ఉదయం 11 గంటలకు జడ్పీ సమావేశ మందిరంలో ప్రీ బీడ్ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామని, సమావేశంలో బహిరంగ వేలంలో పాల్గొనే వారు సందేహాలను, అనుమానాలను నివృత్తి చేస్తామని తెలిపారు. ఈ ప్లాట్లను ఈ నెల 17న జడ్పీ సమావేశ మందిరంలో బహిరంగవేలం ద్వారా అమ్మకాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం 58 ప్లాట్లకు సంబంధించిన సమాచారాన్ని ఈ సమావేశంలో పూర్తి వివరాలను తెలియజేస్తామని తెలిపారు. రాజీవ్ స్వగృహ లేఅవుట్‌లో విద్యుత్ లైన్లు, మురికి కాలువలు, ప్లాంటేషన్, అంతర్గత రోడ్లు వంటి మౌళిక సౌకర్యాలకు రూ.7కోట్ల నిధులు కోరడం జరిగిందని తెలిపారు. ఉత్సాహవంతులు, ఎలాంటి చిక్కులు లేని ప్లాట్లను సొంతం చేసుకునేందుకు బహిరంగ వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. లే అవుట్‌లో జరుగుతున్న రోడ్లు, ఇతర పనులను పరిశీలించారు. ఈ పరిశీలనలో ఆర్డీఓ రమేష్ రాథోడ్, మావల తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, కలెక్టరేట్ పర్యవేక్షకులు రాజేశ్వర్, టీఎస్ఐఐసీ జూనియర్ ఇంజనీర్ రాజ్‌కుమార్, టౌన్ ప్లానింగ్ అధికారి సాయికిరణ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హన్మంత్‌రావు పాల్గొన్నారు.

మాతా శిశు మరణాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్



ఆసిఫాబాద్ : జిల్లాలో మాతా శిశు మరణాలను వంద శాతం నియంత్రించేందుకు సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. గురువారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయితో కలిసి ప్రజల ఆరోగ్యం, గర్భిణుల సంక్షేమం, రక్తహీనత లోపం నియంత్రణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గర్భం దాల్చిన మహిళల వివరాలను నమోదు చేసి సమయానుసారంగా వారికి పరీక్షలు నిర్వహించాలని పేర్కొన్నారు. రక్తహీనత సమస్య ఉన్న వారికి అవసరమైన మందులు, పోషకాహారం అందించాలని, గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు జరిగే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని, రక్తహీనత కలిగిన వారికి ఐరన్ మాత్రలు అందించాలని తెలిపారు. వైద్య సేవలు అందించిన ప్రతి ఒక్కరి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, హైరిస్క్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉప వైద్యాధికారులు సుధాకర్ నాయక్, సీతారాం, సునీల్‌రావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వివాహా వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



బెజ్జూర్ : మండల కేంద్రంలో గురువారం జరిగిన మండల పరిషత్ అటెండర్ బుజ్జ బానయ్య కుమార్తె స్వప్న వివాహా వేడుకలకు ఎమ్మెల్యే కోనేరు కోనప్ప హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై మృతి చెందిన బీఆర్ఎస్ నాయకుడు సూర్ల శంకర్ కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మండల కోఆప్షన్ సభ్యుడు బషరత్‌ఖాన్, ఎంపీటీసీ శ్రీనివాస్, సర్పంచ్ బి శేఖర్, బీఆర్ఎస్ ప్రెసిడెంట్ సకారాం, నాయకులు వెంకన్న, రాజారామ్, జావిద్ అలీ ఉన్నారు.

భగీరథ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఉట్నూర్ : తమ సమస్యలు పరిష్కరిచాలని మిషన్ భగీరథ కార్మికులు కోరారు. ఈ మేరకు గురువారం డిప్యూటీ తహసీల్దార్ భుజంగ్‌రావ్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల సెగ్మెంట్ పరిధిలోని సుమారుగా 600మంది కార్మికులు పని చేస్తున్నారన్నారు. నాలుగు నెలల నుండి జీతాలు చెల్లించడంలో ఎల్అండ్‌టీ, ఎవరెస్టు రాఘవ, మెగా కంపెనీ యాజమాన్యాలు పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు. జీతాల గురించి అడిగితే దాట వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాల మీదనే ఆధారపడి జీవిస్తున్న తమకు జీతాలు చెల్లించక నానా ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమకు జీతాలు చెల్లించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందించిన ప్రతినిధి బృందంలో మిషన్ భగీరథ కాంట్రాక్టు కార్మికుల సంఘం మండల నాయకులు హరీష్, బాబా సాహెబ్, సంతోష్, కిరణ్, రాజు, చంద్రకాంత్ ఉన్నారు.

ఒత్తిడి లేకుండా 'పది' పరీక్షలు రాయాలి

- ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా పదోతరగతి పరీక్షలు రాయాలని జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్‌లో ఏర్పాటు చేసిన పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలపై అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు పరీక్షలను ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా బాగా చదివి రాసి మంచి మార్కులు సాధించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు కావలసిన సౌకర్యాలు ప్రభుత్వం తరపున కల్పిస్తున్నట్లు వివరించారు. సౌకర్యాలు వినియోగించుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. ఎమ్మెల్యే ఆత్రం సక్కు మాట్లాడుతూ విద్యార్థులు సంవత్సరం చదివిన చదువును మూడు గంటల్లో రాయాలంటే ఎంతో ఏకాగ్రత అవసరమన్నారు. ఆ దిశగా వారిని సిద్ధం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవడంతో పాటు జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. అప్పుడే చదువు చెప్పిన ఉపాధ్యాయులకు చదివించిన తల్లిదండ్రులకు మంచి బహుమతి ఇచ్చినట్లు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి అశోక్, ఎంపీపీ మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, కాంట్రాక్టర్ అబ్దుల్లా, ఫయాజ్, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి.మధు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సానిటేషన్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి బి.మధు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో నిర్వహించిన వర్కర్ల సమావేశంలో మాట్లాడారు. ఉట్నూరు ఐటిడిఎ పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో, హాస్టల్స్‌లో పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్స్, పార్ట్ టైం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రస్తుతం అవుట్ సోర్సింగ్ పేరుతో రోజంతా పని చేయించుకుంటూ వేతనాలు మాత్రం అతి తక్కువగానే చెల్లిస్తున్నారని, ఈ పద్ధతి ఒక్క ఉట్నూరు ఐటిడిఎ పరిధిలో తప్ప రాష్ట్రంలో మరెక్కడా లేదన్నారు. కరోనా లాక్‌డౌన్ కారణంగా గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్‌ను మూసివేశారని, వీటిల్లో పనిచేస్తున్న డైలీవేజ్, అవుట్ సోర్సింగ్ కార్మికులు పూర్తిగా ఉపాధి కోల్పోయారని తెలిపారు. లాక్‌డౌన్ కాలంలో కార్మికులందరికీ పూర్తి వేతనం చెల్లించాలన్నారు. జీఓ. నెం 45ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసినప్పటికీ వీరికి అమలు కాలేదన్నారు. అందరిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కమిషనర్ జారీ చేసిన జీఓ ప్రకారం 10 సంవత్సరాల సర్వీస్ ఉన్న ప్రతి ఒక్కరికి రెగ్యులర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. పెండింగ్ వేతనాలు చెల్లించడంతో పాటు గుర్తింపు కార్డు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్ డైలీవేజ్, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టేకం ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షులు అరిగెల కోటయ్య, వర్కర్లు కొమురం లక్ష్మణ్, నైతం మహాదు, సీఐటీయు జిల్లా నాయకులు వెలిశాల క్రిష్ణమాచారి పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్

- సీనియర్ సివిల్ జడ్జి అర్పిత మారంరెడ్డి



నవతెలంగాణ-మంచిర్యాలటౌన్

విద్యార్థులు అంకిత భావంతో, కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సీనియర్ సివిల్ జడ్జి అర్పిత మారంరెడ్డి అన్నారు. గురువారం లక్షెట్టిపేట పట్టణంలోని గురుకుల పాఠశాల విద్యార్థులకు మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ విద్యార్థి దశలో ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. కొన్ని సార్లు ఇబ్బందులు ఎదురైనప్పటికీ విద్యార్థి దశలో కచ్చితత్వంతో కష్టాలకు భయపడకుండా చదివితే సమాజానికి ఆదర్శంగా నిలవవచ్చని వివరించారు. ముఖ్యంగా సోషల్ మీడియాకు దూరంగా ఉండి తల్లిదండ్రులు చదువు కోసం పడుతున్న కష్టాలను గుర్తుకు తెచ్చుకుంటే విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని సాధించగలరని తెలిపారు. అదే విధంగా సమాజంలో జరుగుతున్న పరిణామాలను గుర్తించి చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అంతకుముందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడికొప్పుల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ చదువుపై దృష్టి పెట్టి, ఇతర విషయాలకు దూరంగా ఉండాలన్నారు. టీనేజ్‌లో దృఢ సంకల్పంతో చదివితేనే మంచి పౌరులుగా రాణిస్తారన్నారు. అర్థవంతంగా ప్రశ్నించే స్వభావాన్ని పెంపొందించుకుంటే విద్యార్థులు చదువుతో పాటు సమాజానికి ఉపయోగపడతారని వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐ కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ లలిత కుమారి, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

11న జీపీ కార్మికుల సమావేశం

బెజ్జూర్ : ఈ నెల 11న కాగజ్‌నగర్ పట్టణంలోని విద్యాధరి పాఠశాలలో గ్రామ పంచాయతీ కార్మికుల సమావేశం నిర్వహించనున్నట్టు సీఐటీయూ జిల్లా నాయకులు వెలిశాల కృష్ణమాచారి తెలిపారు. సమావేశానికి సీఐటీయూ రాష్ట్ర నాయకులు మధు హాజరవుతున్నారన్నారు. పంచాయతీ కార్మికులందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని మామిడిగూడ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం అంతర్జాతీయ మహిళా



దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా మహిళ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆటపాటలల్లో గెలుపొందిన మహిళలకు ఏటీడీఓ నిహారిక బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్, ఎస్సీఆర్టీ నగేష్, సీఆర్పీ శంకర్, స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్, నిర్మల్

2

శుక్రవారం 10 మార్చి 2023

చలి వేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-తాంసి

మండలకేంద్రంలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద సర్పంచ్ సహకారంలో గురువారం చలివేంద్రాన్ని సర్పంచ్ స్వప్న రత్నప్రకాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో గ్రామానికి వచ్చి పోయే ప్రయాణికులు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా ఉండటానికి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో చలి వేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, వార్డు సభ్యులు కాంతరెడ్డి, కళ్యాణ్, ఆటో యూనియన్ సభ్యులు జైజవాన్, శ్రీనివాస్, దేవన్న, దీపక్, పలువురు సభ్యులు ఉన్నారు.



బీసీ సంఘం నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-తలమడుగు



మండలంలోని పల్లి(కే) గ్రామ బీసీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని సంఘం నాయకులు గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గుమ్ముల రవి, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ ధర్మపురి, గౌరవ అధ్యక్షులుగా ఆత్మకూరు స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొండ్రా రాకేష్, కోశాధికారిగా గుమ్ముల సాయిరాం, సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా సీహెచ్ సాయిలతో పాటు 20 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులతో పాటు మండల నాయకులను గ్రామస్తులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం మండల నాయకులు మేకల రవికాంత్ యాదవ్, పల్లి(బి) బీసీ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, గంగాధర్, జక్కుల రవీందర్, సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-నార్నూర్

కరీంనగర్‌లో కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన హత్ సేహత్ జోడో బహిరంగ సభ కార్యక్రమాన్ని మద్దతుగా నిలువడానికి గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు బయలుదేరారు. రాబోయే ఎన్నికలలో గెలిచి అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీయే అని ధీమా వ్యక్తం చేశారు. సభకు వెళ్లిన వారిలో పార్టీ మండల ఇన్‌ఛార్జి యూసుఫ్ ఖాన్, కార్యకర్తలు కరీం ఖాన్, కైలాష్ జాదవ్, విలాస్, ఎస్డీ నిజాం, మాణిక్ రావు, టి.విష్ణు, కే.రాహుల్, షాకిబ్‌ఖాన్, విశ్వనాథ్, షేక్ నసీర్, బాలాజీ, కార్తిక్ రాథోడ్, రాజేశ్వర్, విజయ్, అయ్యుబ్ ఉన్నారు.

ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలి

- డీఎంహెచ్‌ఓ నరేందర్ రాథోడ్

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఆస్పత్రికి వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. గురువారం జన ఔషధి దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీని సందర్శించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రిలో అందుతున్న ప్రసూతి, కుక్క కాటు, కంటివెలుగు, దీర్ఘకాలిక రోగులకు అందిస్తున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. జన ఔషధి దినోత్సవం సందర్భంగా దీర్ఘ కాలిక రోగాలైన బీపీ, డయాబెటిస్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. అవసరమైన వారికి పరీక్షలు నిర్వహించి, మందులను అందజేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట స్థానిక వైద్యులు శ్రీకాంత్, సిబ్బంది శ్రీనివాస్ ఉన్నారు.

నేడు న్యాయ విజ్ఞాన అవగాహనా సదస్సు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలోని న్యాయ సేవా భవన్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు డీఎల్ఎస్ఎ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటలకు నిర్వహించే ఈ సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

రిమ్స్‌లో ప్రపంచ కిడ్నీ దినోత్సవం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని గురువారం రిమ్స్ డయాలసిస్ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ కేక్ కట్ చేసి, వైద్యులకు, సిబ్బందికి తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిడ్నీ వ్యాధుల బారిన పడకుండా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పర్యవేక్షకుడు ఇద్రిస్ అక్బాని, డయాలసిస్ కేంద్రం ఇన్‌చార్జ్ తానాజీ, డాక్టర్ క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-గుడిహత్నూర్

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం రాత్రి మండలంలోని మన్నూర్ గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మన్నూర్ గ్రామానికి చెందిన కైరీ దత్తా(45) మద్యం మత్తులో ఆత్మహత్య చేసుకున్నాడు. డైరీ దత్తా, నాగాబాయి వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. గత కొన్ని రోజులుగా దత్తా పనులకు వెళ్లకుండా మద్యం తాగుతూ ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో భార్య నాగాబాయి ఈ విషయమై మందలించడంతో ఇంట్లో గొడవ జరిగింది. దీంతో దత్తా భార్యను ఇంటి నుంచి వెళ్లిపోమనగా ఆమె తనతో ఉన్న ఇద్దరు కుమారులు శశికాంత్, బాలాజీలను తీసుకొని అదే ఊరిలోని పుట్టింటికి వెళ్లింది. వీరి పెద్ద కుమారుడు మురళి హైదరాబాద్‌లో ఎలక్ట్రిషియన్‌గా పని చేస్తున్నాడు. కాగా మూడు రోజులుగా వీరు ఇంట్లో లేక పోవడంతో దత్తా రోజూ మద్యం తాగుతూ ఉన్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి మద్యం మత్తులో ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకున్నాడు. తెల్లవారుజామును చిన్న కొడుకు బాలాజీ ఇంటి వైపు వెళ్లగా తండ్రి ఉరేసుకొని ఉండటం చూసి చుట్టుప్రక్కల వారిని పిలిచాడు. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. భార్య నాగాబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జోడో యాత్ర జోరుగా సాగుతోంది

- కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జి మాణిక్ రావ్ ఠాక్రే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హత్‌సే హత్ జోడో యాత్ర జోరుగా సాగుతోందని కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జీ మాణిక్ రావ్ ఠాక్రే అన్నారు. గురువారం కరీంనగర్ బహిరంగ సభకు వెలుతున్న ఆయన స్థానిక నాయకులతో కలిసి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తునన ప్రజా వ్యతిరేక విధానాలకు క్షేత్రస్థాయి వరకు తీసుకేళ్లడమే లక్ష్యంగా హత్‌సే హత్ జోడో యాత్రను ప్రారంభించడం జరిగిందని అన్నారు. స్థానిక నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువతో సత్కరించారు. తెలంగాణ వ్యాప్తంగా హత్ సే హత్ జోడో యాత్ర జోరుగా సాగుతోందని అన్నారు. నాయకులు కూడా ఉత్సహంగా పాల్గొంటూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ రైతుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉందని అన్నారు. ధరణిలో రైతుల భూముల వివరాలు రికార్డుల్లో రాలేదన్నారు. దీనిపై కరీంనగర్ నుంచి రైతుల పక్షాన ఉద్యమాన్ని ఈనెల పది నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. దీనిపైనే రాబోయే రోజుల్లో జిల్లాల వారీగా యాత్రలకు ప్రణాళికలను చేస్తామని అన్నారు. మాణిక్ రావ్ ఠాక్రేను కలిసిన వారిలో డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, ఏఐసీసీ సభ్యులు డా.నరేష్ జాదవ్, గంద్రత్ సుజాత, సంజీవ్ రెడ్డి, నగేష్, శ్రీధర్ నాయకులు ఉన్నారు.

టీఎస్ కాస్ట్, న్యాక్ సంస్థలతో ఆర్జీయూకేటీ ఒప్పందం

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

నవతెలంగాణ-బాసర

ఆర్జీయూకేటీ యూనివర్సిటీ రాష్ట్రంలోని రెండు సంస్థలతో గురువారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్ అటవీశాఖ ప్రధాన కార్యాలయం అరణ్య భవనంలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ఆర్జీయూకేటీ వైస్ ఛాన్సలర్ వెంకటరమణ, సమక్షంలో తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (టీఎస్ కాస్ట్) మెంబర్ మారుపాక నగేష్, ఆర్జీయూకేటీ డైరెక్టర్ సతీష్ కుమార్ అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ టీఎస్ కాస్ట్, ఆర్జీయూకేటీ విద్య సంస్థ సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఐటీశాఖ మంత్రి కేటీఆర్ సహకారం ఆలోచన విధానంతో మొదటిసారి అవగాహన ఒప్పందం చేసుకోవడం సంతోషకరమని తెలిపారు. టీఎస్ కాస్ట్, ఆర్జీయూకేటీ యూనివర్సిటీ పరిశోధన, సైన్స్ టెక్నాలజీలలో నూతన ఆవిష్కరణలతో ఇరు సంస్థలు అభివృద్ధి పథంలో ముందుకెళ్తాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. వీసీ వెంకటరమణ మాట్లాడుతూ నిర్మల్ జిల్లాలో ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటులో భాగస్వాములు అవుతామని, ఇంటలెక్చువల్ ప్రాపర్టీ సెల్ టీఎస్ కాస్ట్ సహకారాలతో ఆర్జీయూకేటీ లో నెలకొల్పుతామని అన్నారు. ప్రయోగశాల నుండి ప్రజలకు సాంకేతికతను జోడిస్తూ, ఉమ్మడి రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులను నిర్వహించడమే కాకుండా సెమినార్లు, సమావేశాలు, వర్క్‌షాప్‌లు నిర్వహించడానికి టీఎస్ కాస్ట్ ద్వారా ఆర్జీయూకేటీ యూజీ, పీజీ విద్యార్థులకు మార్గనిర్దేశం చేసేందుకు ఎంతగానో తోడ్పడుతుందని విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. రెండవ ఒప్పందం నేషనల్ అకాడమిక్ కన్స్ట్రక్షన్ హైదరాబాద్ సంస్థతో ఆర్జీయూకేటీ వైస్ ఛాన్సలర్ సమక్షంలో న్యాక్ సంస్థ



డైరెక్టర్ జనరల్ భిక్షపతి యూనివర్సిటీ డైరెక్టర్ సతీష్ కుమార్ అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ వెంకటరమణ మాట్లాడుతూ న్యాక్ సంస్థ ఒప్పందం వల్ల సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు మేలు జరుగుతుందని అన్నారు. అధ్యాపకులకు, విద్యార్థులకు పరిశోధన, ట్రైనింగ్, ఇంటెన్షిప్ ఉపాధి, ఉద్యోగ అవకాశాలలో పరస్పర సహకారాలు అందిపుచ్చుకోవడానికి ఈ ఒప్పందం ఎంతోగాను ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. డైరెక్టర్ జనరల్ భిక్షపతి మాట్లాడుతూ ఈ ఒప్పంద ముఖ్యఉద్దేశం నిర్మాణ పరిశ్రమ యొక్క నాణ్యత ఉత్పాదకతను పెంచడానికి మానవ వనరుల సామర్థ్యాలను అభివృద్ధి చేయడం. నైపుణ్యాలను ఉన్నతీకరిస్తూ అన్ని రకాల మానవ వనరుల సామర్థ్యాలకు సహకారంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ శాంతి రాధాకృష్ణ, డీన్ చంద్రశేఖర్, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



నవతెలంగాణ-లోకేశ్వరం

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రాజుర గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మంజూరైన రూ.20 లక్షల నిధులతో సీసీరోడ్లు, డ్రైనేజీ, కుర్మ సంఘం భవనం, పలు అభివృద్ధి పనులకు మండల బీఆర్ఎస్ నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం రాజుర నుండి గడ్‌చాంద గ్రామానికి వెళ్లేందుకు మొరం రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, ప్రజారోగ్యమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముత్తా గౌడ్, ఎంపీపీ లలిత భోజన్న, ఎంపీటీసీ నర్సవ్వ పోతన్న, పీఏసీఎస్ చైర్మెన్ రత్నాకర్ రావు, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్, లోకేశ్వరం గ్రామ సర్పంచ్ కపిల్, సోషల్ మీడియా అధ్యక్షులు బండి ప్రశాంత్, గ్రామ అభివృద్ధి కమిటీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

13న సీపీఐ(ఎం) జిల్లా విస్తృత స్థాయి సమావేశం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్

నవతెలంగాణ-కడెం

మండల కేంద్రంలో 13న జరిగే సీపీఐ(ఎం) జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని హరిత హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశాలలో భవిష్యత్ కార్యాచరణ నిర్ణయించుకొని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా ఉద్యమాలు నిర్వహించనున్నామన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు మతోన్మాదంపై దేశవ్యాప్త ప్రచారం నిర్వహించనున్నామని అన్నారు. రాష్ట్రంలో ప్రజలు స్వాధీనం చేసుకున్న ఇండ్ల స్థలాలకు పట్టాలివ్వాలని, పోడు భూములకు హక్కుపత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీలో 200 రోజులు పని దినాలు కల్పించాలని అన్నారు. రోజుకు దినసరి కూలీ రూ.600 చెల్లించాలని ఈ సమావేశాలలో కార్యాచరణ రూపొందించనున్నామని అన్నారు. ఈ ప్లీనం సమావేశానికి రాష్ట్ర నాయకులు హాజరవుతారని అన్నారు. ప్రజలు, కార్యకర్తలు, శాఖ కార్యదర్శులు హాజరై, జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం)



ఏరియా కమిటీ కన్వీనర్ డాకూర్ తిరుపతి, సీనియర్ నాయకులు కొండపేట గ్రామ సర్పంచ్ పార్టీ ఏరియా కమిటీ సభ్యులు దుర్గం పోశలింగంలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యం

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్



నవతెలంగాణ-సారంగాపూర్

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేయకపోతే తెలంగాణ రాష్ట్రంలో కాస్తో కూస్తో ఉన్న రాజకీయ ప్రాతినిధ్యం కోల్పోయి, బీజేపీకి తగిన రాజకీయ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా నుండి ప్రారంభ మైన మాదిగల సంగ్రామ యాత్ర 8వ రోజు గురువారం సారంగాపూర్ మండలంలోని మలక్ చించోలీ గ్రామానికి చేరుకుంది. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2014లో బీజేపీ దేశంలో అధికారంలోకి వస్తే వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి, దారుణంగా మోసం చేసిందని అన్నారు. ప్రస్తుతం దేశంలో సంపూర్ణ మెజారిటీ అధికారంలో ఉండి కూడా ఎస్సీ వర్గీకరణ మీద బీజేపీ దృష్టి పెట్టకపోవడం మాదిగలకు నమ్మక ద్రోహం చేయడమే అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలని కలలుకంటోందని అన్నారు. మాదిగలకు న్యాయం చేయకపోతే తెలంగాణ బీజేపీకి మూల్యం తప్పదన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఏప్రిల్ 4న ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అధిక సంఖ్యలో తరలి రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మునుగూరి ప్రణీత్, నిర్మల్ జిల్లా కన్వీనర్ శనిగారపు కమలాకర్, ఎంపీఎస్ జిల్లా కన్వీనర్ బర్ల రాజ్ కుమార్, నంద కుమార్, నాయకులు సాయిచంద్, గజేందర్, సాయందర్, యాత్ర బృందం బాలు యాదవ్, అభిషేక్, మహిపాల్ పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని రుయ్యాడి గ్రామంలో కొనసాగుతున్న కంటివెలుగు శిబిరాన్ని గురువారం అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పరిశీలించారు. కంటి పరీక్షల నిర్వహణ తీరుపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఉచితంగా అందిస్తున్న కండ్లద్దాలను తప్పక వాడాలని కోరారు. గ్రామంలో కంటి సమస్యలు ఉన్నవారు. కంటి పరీక్ష కేంద్రానికి వచ్చి పరీక్షలు నిర్వహించుకోవాలని అన్నారు. మొదటగా గ్రామ సమీపంలోని నర్సరీ వద్దకు వెళ్లి మొక్కలను పరిశీలించారు. ఎండాకాలం సమీపిస్తుండటంతో మొక్కలకు సకాలంలో నీళ్లు పట్టిస్తూ, ఎండి పోకుండా కాపాడాలని సిబ్బందిని కోరారు. అదనపు కలెక్టర్ వెంట గ్రామ సర్పంచ్ పోతారెడ్డి, ఎంపీఓ దిలీప్ కుమార్, పంచాయతీ కార్యదర్శి అభయ్ కుమార్, కారోబారి సంజీవరెడ్డి, గ్రామస్తులు మోహన్ ఉన్నారు.

కొండుకూర్‌లో కంటి వెలుగు శిబిరం ప్రారంభం



నవతెలంగాణ-కడెం

మండలంలోని కొండుకూర్‌లో సర్పంచ్ గొల్ల వేణుగోపాల్, ఎంపీటీసీ నల్ల దేవేంద్ర, జీవన్ రెడ్డి, ఎంపీఓ వెంకటేశ్వర్లు, డాక్టర్ అనిల్, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ గోపాల్ గురువారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రజల శ్రేయస్సుకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. సంక్షేమ పథకంలో భాగంగా కొండుకూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని గ్రామ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, భీమేష్, వార్డు సభ్యులు అల్లాడి కళ, కల్లెం సతీష్‌రెడ్డి, పార్శ గంగమౌళి, పొద్దుటూరి సంపత్‌రెడ్డి, పొద్దుటూరి రామ సంజవ్‌రెడ్డి, గోధురి పుష్ప లత రాజు, నేరెళ్ల రమాదేవిబాలరాజు, సెక్రటరీ భూమేష్, ఆశ వర్కర్, వీఓ లీడర్లు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బాలికల ఆత్మ రక్షణకు తైక్వాండో శిక్షణ

నవతెలంగాణ-తలమడుగు

పాఠశాలలో చదివే విద్యార్థినులు సంఘ విద్రోహక శక్తుల నుండి తమను తాము రక్షించు కోవడం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో చదువుతున్న బాలికల కోసం తైక్వాండో కరాటే శిక్షణను ఇప్పిస్తున్నదని శిక్షకులు కరాటే మాస్టర్ వీరేష్ అన్నారు. గురువారం ఖోడద్ గ్రామ ఉన్నత పాఠశాలలో గత 30 రోజులుగా బాలికలకు తైక్వాండో కరాటే శిక్షణను ఇవ్వడం జరుగుతుందని అన్నారు. దీని ద్వారా బాలికలు తమను తాము రక్షించుకోగలుగుతారని అన్నారు. గత నెల రోజులుగా పాఠశాల బాలికలకు శిక్షణ అందించిన తైక్వాండో మాస్టర్ వీరేష్‌ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది వెంకన్న, విజయలక్ష్మి, లక్ష్మి సుకుమార్ పెట్కులే, వాసుదేవ్, సురేఖ, పీఈటీ మమత, కిరణ్ కుమార్, సత్యమ్మ పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ వనజ అన్నారు. గురువారం మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలో అంగన్‌వాడీ టీచర్లకు, అంకోలి ఉన్నత పాఠశాలలో పూర్వ ప్రాథమిక విద్య గురించి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయడం ద్వారా ప్రాథమిక విద్యను. ఉన్నత విద్యను బలోపేతం చేయగలమని అన్నారు. విద్య ప్రాధాన్యతను వివరించారు. ఈ సమావేశంలో మండలంలోని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నీరజ, రూప, లక్ష్మి, విజయలక్ష్మి, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు నరేందర్ రెడ్డి, మహిత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు త్రివేణి, ఆదర్శ్, వివిధ గ్రామాల నుండి అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి బీఆర్ఎస్ కృషి

నవతెలంగాణ-ఇచ్చోడ

రైతు సంక్షేమ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ భవన నిర్మాణానికి స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వ ఏర్పాటు తర్వాతనే మన వెనుకబాటు తగ్గి అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని అన్నారు. సహకార సంఘ పాలకవర్గం సభ్యులు, రైతాంగ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ అనీల్‌రెడ్డి, నారాయణ్ రెడ్డి, ఎంపీటీసీ నిమ్మల శివకుమార్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ దేవనంద్, రైతుబంధు అధ్యక్షులు ముస్తఫా, రాథోడ్ ప్రవీణ్ కుమార్, ఆర్గుల గణేష్ పాల్గొన్నారు.

మావల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఇమ్రాన్ ఖాన్

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మావల మండల నూతన తహసీల్దార్‌గా ఇమ్రాన్‌ఖాన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. నూతన తహసీల్దార్‌కు స్వాగతం పలికి బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ వనజరెడ్డికి వీడ్కోలు తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్‌కు పుష్పగుచ్చాన్ని అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డీటీ ప్రవీణ్, ఆర్ఐ హన్మంత్ రావు, అమృత్, వినోద్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్లకు ఘన సన్మానం

నవతెలంగాణ-తలమడుగు

మండలంలో తహసీల్దార్‌గా పనిచేసి బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్‌ను, మావల మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహించి, బదిలీపై మండలానికి వస్తున్న తహసీల్దార్ వనజారెడ్డిని గురువారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఇద్దరి తహసీల్దార్‌లను మండల నాయకులు, అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు, ప్రమోషన్లు సర్వసాధారణమైనప్పటికీ, తమ విధులు సంక్రమంగా నిర్వహించి, ప్రజల గుండెల్లో ఉండిపోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కళ్యాణం లక్ష్మి రాజేశ్వర్, జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, సర్పంచ్ కరుణాకర్ రెడ్డి, ఎంపీటీసీ చంటి, ఎంపీడీఓ రమకాంత్, పశువైద్యాధికారి దూద్‌రాం, డిప్యూటీ తహసీల్దార్ సంతోష్ కుమార్, ఏపీఓ మేఘమాల, సర్పంచ్‌లు రమేష్ రెడ్డి, పోతారెడ్డి, అంగూర్, మండల నాయకులు కిరణ్ కుమార్, ప్రకాష్‌రావు, వెంకట్‌యాదవ్, తోట వెంకటేష్, అబ్దుల్లా, బాబుఖాన్, వ్యవసాయ శాఖ అధికారులు రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అభయాంజనేయ విగ్రహా ప్రతిష్ఠాపన

నవతెలంగాణ-తాంసి

అభయ ఆంజనేయ భారీ విగ్రహాన్ని గురువారం మండలంలోని పొన్నారిలో వేదపండితులు, పూజ కార్యక్రమాలతో ఉదయం వేకువ జామున ప్రతిష్టపన చేశారు. ప్రతిష్టాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, బీజేపీ నాయకురాలు సుహాసినిరెడ్డితో పాటు పలువురు జెడ్పీటీసీలు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ముఖ్యఅతిథులను గ్రామ సర్పంచ్ సంజీవ్‌రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్తుల సహకారం ఐక్యతతో అభయ ఆంజనేయ భారీ విగ్రహాన్ని ఎర్పాటు చేయడం సంతోష దగ్గ విషయం అన్నారు. ఆంజనేయ ఆలయం లేని గ్రామం ఉండదని అన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని అనుసరించడం నేర్చుకోవాలని అన్నారు. పొన్నారి గ్రామం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్నదానం ఎర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు రాజు, సుధాకర్, అనిల్ జాదవ్, వైస్ ఎంపీపీ రేఖా రఘు, నాయకులు అరుణ్, రమణ, సంజీవ్‌రెడ్డి, విలాస్, అలయ కమిటి సభ్యులు ఉన్నారు.

బ్యాంక్ క్యాషియర్‌పై కేసు నమోదు

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఓ బ్యాంకు క్యాషియర్‌పై కేసు నమోదైన ఘటన ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. టూ టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ప్రధాన బ్రాంచ్‌లో క్యాషియర్ యుగంధర్ ఓ నలుగురు ఖాతాదారుల అకౌంట్ల నుంచి డబ్బులను డ్రా చేశాడు. గత సంవత్సరంలో నలుగురు ఖాతాదారుల నుంచి వారికి తెలియకుండా ట్రాన్సక్షన్ జరిగింది. అయితే సదరు ఖాతాదారులు బ్యాంకు మేనేజర్‌ను సంప్రదించి తమ సమస్యలు విన్నవించి ఫిర్యాదు చేశారు. దీంతో బ్యాంకు మేనేజర్ పై అధికారులకు తెలిపారు. వారు ఓ కమిటీని ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు. చివరకు బ్యాంక్‌లో పనిచేసే క్యాషియర్ సదరు ఖాతాదారుల సంతకలను ఫోర్జరీ చేసి రూ.లక్ష 60 వేల నగదు కాజేసినట్లు తెలిసింది. దింతో బ్యాంక్ మేనేజర్ ఇందల్ క్యాషియర్ యుగంధర్ పై గురువారం టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

తహసీల్దార్‌గా గంగాధర్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఇంద్రవెల్లి నూతన తహసీల్దార్‌గా గంగాధర్ గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలపై ప్రజలకు ఎల్ల వేళలా అందుబాటు ఉంటూ వారి సమస్యల పరిష్కరిస్తానని పేర్కొన్నారు.

12న ఆన్‌లైన్‌లో గురుకుల ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సీఓఈ గిరిజన గురుకుల కళాశాలలో అడ్మిషన్‌ల కోసం ఈ నెల 12న ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు టీటీడబ్ల్యూయు ఆర్‌జేసీ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు టీటీడబ్ల్యూఆర్‌ఈఐఆర్.ఏసీ.ఇన్ వెబ్ సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవాలని తెలిపారు. ఉదయం 10 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని అన్నారు. ప్రతి విద్యార్థి పరీక్ష కేంద్రానికి గంట ముందే అనగా 9 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూసించారు. హాల్ టికెట్, ప్యాడ్, పెన్ వెంట తీసుకరావాలని ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్ష హాల్‌లోకి అనుమతించబడవని పేర్కొన్నారు. హాల్ టికెట్‌పై ఫోటో రాని వారు ఏదేని ఫోటో ఐడెంటిటీ కార్డు తీసుకురావాలన్నారు. జిల్లా కేంద్రంలోని మూడు సెంటర్లలో 800 మంది పరీక్ష రాయనున్నట్లు తెలిపారు.

నిరవధిక దీక్షను భగ్నం చేసిన పోలీసులు

జన్నారం : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన చెరువులు ప్రభుత్వ భూములు కబ్జా అవుతున్నాయని, ఆ భూములను ప్రభుత్వ అధికారులు కాపాడాలని చింతగూడ పీఏసీఎస్ వైస్ చైర్మన్ కమ్మల విజయ ధర్మ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను గురువారం పోలీసులు భగ్నం చేశారు. దీక్ష చేయడానికి పూనుకున్న విజయ ధర్మను స్థానిక ఎస్సై పి.సతీష్ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకొని లక్షెట్టిపేట్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా చింతగూడ పీఏసీఎస్ వైస్ చైర్మన్ కమల విజయ ధర్మ మాట్లాడుతూ తపాలాపూర్, సింగరాయపేట ఊర చెరువు ఆ గ్రామ సర్పంచి మార్కెట్ కమిటీ చైర్మన్లు కబ్జా చేసుకుని వారి కుమారుల పేరు మీద పట్టా చేసుకున్నారని వెంటనే ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు. అప్పటివరకు తమ దీక్షను కొనసాగిస్తామన్నారు. శాంతియుతంగా దీక్ష చేస్తున్న తనను పోలీసులు ఇలా అక్రమంగా అరెస్టు చేసి తీసుకువెళ్లడం దారుణం అన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి కబ్జా భూములను కాపాడాలని కోరుతున్నామన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని మురిమడుగు గ్రామానికి చెంది నకొండ్ర రాజన్న గత నెలలో ఒమాన్-సాలలా పట్టణంలో గుండె పోటుతో మరణించాడు. 'తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి టీజీడబ్ల్యూడబ్ల్యూసీ ఆధ్వర్యంలో ఎప్పటికి అప్పుడు ఇండియన్ కౌన్సిలేట్ మరియు కంపెనీతో మాట్లాడి కొండ్ర రాజన్న డెడ్ బాడీ స్వగ్రామానికి రావడానికి ఎంతో కృషి చేసి స్వగ్రామానికి పంపించారు. తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి తరుపున గురువారం, మృతుని కుటుంబానికి రూ.16000 ఆర్థిక సాయం అందచేశారు. వ్యవస్థాపక అధ్యక్షులు కల్లెడ భూమయ్య మాట్లాడుతూ మృతుడు నిరుపేద కుటుంబానికి చెందినవాడాని, రెక్కాడితే డొక్కాడని పరిస్థితి వారిది. ఇంటి యజమానిని కోల్పోయి తెలంగాణ ప్రభుత్వం మృతుని కుటుంబానికి 10లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, కుటుంబాన్ని ఆదుకోవలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రూ.500 కోట్లతో గల్ఫ్ కార్మికుల సంక్షేమం కొరకు గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సేపూర్ గోపాల్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అమరగొండ తిరుపతి, రాష్ట్ర సలహాదారులు మగ్గిడి తిరుపతి, జిల్లా అధ్యక్షులు జవుడాల సత్తన్న, మండల అధ్యక్షులు పాలాజీ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి దుమ్మల ఎల్లయ్య, గ్రామ అధ్యక్షులు పూదూరి సతీష్, చిట్యాల చంద్రయ్య, పందిరి రాజు, పుల్ల లచ్చన్న పాల్గొన్నారు.

బాబాపూర్‌లో బంజారా భవన్ నిర్మించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని బాబాపూర్‌లో బంజారా భవన్ కమ్యూనిటీ భవనం నిర్మించాలని సేవాలాల్ మహారాజ్ కమిటీ ప్రధాన కార్యదర్శి శివప్రసాద్ కోరారు. ఎమ్మెల్యే ఆత్రం సక్కును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబాపూర్‌లో సేవాలాల్ మహారాజ్, జగదాంబ ఆలయాలు ఉన్నప్పటికీ, కమ్యూనిటీ భవనం లేకపోవడంతో మాల ధరించే భక్తులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. వెంటనే స్పందించి కమ్యూనిటీ భవనం నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని కోరినట్లు వివరించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సేవాలాల్ ఉత్సవ కమిటీ జిల్లా ధర్మ ప్రచారకులు బాధవత్ ఇందులాల్ నాయక్, జాటోత్ వస్రం, కారోబారీ బాదావత్ మత్రులాల్, గణేష్, తిరుపతి, మంగులాల పాల్గొన్నారు.

ఇండ్ల స్థలాలపై ఆరా తీసిన అదనపు కలెక్టర్

నవతెలంగాణ-జన్నారం

మండలంలో నిరుపేదలకు గతంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పేద ప్రజలకు కేటాయించిన ఇళ్ళ స్థలాలపై మంచిర్యాల అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆరా తీశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి ఆదేశాల మేరకు గురువారంమండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డిఓ వేణుతో కలిసి ఆయన తనిఖీ చేశారు. మండలంలో గతంలో నిరుపేదలకు కేటాయించిన ఇళ్ళ స్థలాలు, మిగిలిపోయిన ఇళ్ళ స్థలాల గురించి ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్టు తెలిపారు. అనంతరం మండలంలోని పొన్కల్ గ్రామపంచాయతీ పరిధిలోని ఊర చెరువును ఆర్డిఓ వేణు తహసీల్దార్ ఇట్యాల కిషన్‌తో కలిసి పరిశీలించారు. చెరువును కొందరు అక్రమార్కులు కబ్జా చేస్తున్నారని తరచు వార్తల్లో వస్తున్న సందర్భంలో చెరువును పరిశీలించి ఆక్రమణకు గురైన స్థలాన్ని గుర్తించారు. వెంటనే స్థలాన్ని స్వాధీనం చేసుకొని చెరువు చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలని సూచించారు. మండలంలోని అన్ని గ్రామపంచాయతీ చెరువులను పరిశీలించి కబ్జాకు కాకుండా చూసి చెరువులకు కంచెను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. చెరువులను ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ భానుచందర్ పాల్గొన్నారు.

డీసీపీ, ఏసీపిలను కలిసిన జర్నలిస్టులు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

మంచిర్యాల జిల్లా డీసీపీగా కేకన్ సుధీర్ బెల్లంపల్లి ఏసీపీ పి.సదయ్య లు నూతనంగా పదవి బాధ్యతలు సందర్భంగా గురువారం క్యాతన్‌పల్లి ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు మర్యాదపూర్వంగా కలిశారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కలువల శ్రీనివాస్ అనంతరం జర్నలిస్టులకు సంబంధించిన విషయాలపై ఆయన దృష్టికి తీసుకు వెల్లారు. వెంటనే డీసీపీ పోలీస్ అధికారి స్పందించి జర్నలిస్టులకు తప్పకుండా రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో క్యాతనపల్లి ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి రామిల్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు తూముల భవిష్యత్, కోశాధికారి పరికిపండ్ల రాజు, సంయుక్త కార్యదర్శి పోలుదాసరి శ్రీనివాస్, కమిటీ సభ్యులు చొప్పదండి తిరుపతి, బొజ్జ అనిల్, రాకేష్ పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద డబ్బుల వాసులు నిలిపివేయాలి

నవతెలంగాణ-జన్నారం

పర్యావరణ సెస్ పేరుతో కవ్వాల్ టైగర్ జోన్‌లోని తపాలాపూర్, కలమడుగు చెక్‌పోస్టుల వద్ద రుసుము వసూలు చేయడాన్ని నిలిపివేయాలని జన్నారం లారీ ఓనర్స్ అసోసియేషన్ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల ఎమ్మెల్యే రేఖా నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు ఎస్.కె బాబా మాట్లాడుతూ మండల కేంద్రానికి చెందిన లారీలు, వ్యాన్లు, జీబులు, తదితర వాహనాలకు అటవీశాఖ అధికారులు సెస్ పేరుతో వసూలు చేయడంతో, తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. ఆరు టైర్ల వాహనాలను జన్నారంకు రాకుండా చేయడంతో వేరే రూట్ నుంచి సరుకులను తీసుకొని వస్తే దూర భారం పెరుగుతుందన్నారు. అటవీశాఖ అధికారుల, వల్ల మండల వాసులకు నిత్యవసర సరుకులు అందని పరిస్థితిలో నెలకొంటాయి అన్నారు. ఉన్నత అధికారులు స్పందించి, సెస్ వసూలు నిలిపివేయాలని కోరుతున్నామన్నారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే రేఖా నాయక్ ఉన్నత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ మమ్మద్ రియాజుద్దీన్, లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు ఎం.డి అంజాద్ ఖాన్ జాకీర్, తిరుపతి, నదీమ్, అఫ్జల్ ఖాన్ పాల్గొన్నారు. అనంతరం జన్నారం ఎఫ్డిఓ మాధవరావుకు ఇదే విషయంపై వినతి పత్రాన్ని అందించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్నటువంటి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని గురువారం జేఏసీ తరపున మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పథక అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేస్తున్నామని తమ సమస్యకు పరిష్కరించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పే స్కేల్ కల్పించడంతోపాటు గ్రాట్యూటీ పెంచాలన్నారు. పదోన్నతులు కల్పించాలన్నారు. ప్రత్యేక అలవెన్సులు ఇవ్వాలని కోరారు. వీటితో పాటు మరిన్ని సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రి స్పందించి సమస్యల పరిష్కారానికి తనవంతు కషి చేస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో కుమురంభీం జేఏసీ జిల్లా కన్వీనర్ గోగు మల్లయ్య, టీఏల అధ్యక్షుడు బానోత్ గోపాల్, సభ్యులు దేవయ్య, కోకన్వీనర్ డి.సత్యనారాయణ, వరప్రసాద్, హనుమంతరావు, వినేష్ పాల్గొన్నారు.

వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగ అరెస్ట్

- వివరాలను వెల్లడించిన రామగుండం సీపీ
- నిందితునిపై పలు పోలీస్‌స్టేషన్‌లో 72 కేసులు నమోదు
- దొంగతనం చేసిన సొత్తు విలువ రూ.కోటీ20 లక్షలు



నవతెలంగాణ-నస్పూర్

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న దొంగను గురువారం అరెస్టు చేసినట్లు రామగుండం పోలీస్ కమిషనర్(డీఐజీ) రెమా రాజేశ్వరి తెలిపారు. గురువారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయ ఆవరణలో విలేకరుల సమావేశంలో దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడి వివరాలను వెల్లడించారు. సీసీసీ నస్పూర్‌లోని షిర్కేలో నివాసం ఉంటున్న రాజా, వరకు వెంకటేష్ పలు కాలనీలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్నాడని పేర్కొన్నారు. నిందితుడు నెల్లూరు నివాసి కొన్ని సంవత్సరాల కిందట శ్రీరాంపూర్ చెందిన ఒక అమ్మాయిని ప్రేమ వివాహం చేసుకొని ఈ ప్రాంతంలో నివాసము ఉంటున్నాడని తెఇపారు. 2019లో మొదటి చోరీకి పాల్పడగా, నిందితుడు మద్యానికి బానిసగా మారి, ఆన్‌లైన్ బెట్టింగ్ పాల్పడుతూ వ్యసనాలకి అలవాటు పడి తన విలాసవంతమైన జల్సాల ఖర్చుల కోసం అతను దొంగతనాలను చేయడం కి అలవాటు పడ్డాడని తెలిపారు. దొంగిలించిన ఆభరణాలు ముత్తూట్, శ్రీరామ్ ఫైనాన్స్‌లలో కొంత తాకట్టు పెట్టినాడని, కొంత సొత్తు అమ్మగా వచ్చిన డబ్బులతో మణుగూరులో ఒక ఇంటిని కొన్నాడని తెలిపారు. సుమారు రూ. కోటి 20 లక్షల వరకు దొంగతనాలకు పాల్పడ్డాడని పేర్కొన్నారు. 2023 సంవత్సరం ప్రారంభం నుండి, ప్రివెంటివ్ పోలీసింగ్‌పై ఫోకస్ చేస్తూ నేరాల నియంత్రణకు పోలీసు అనేక రకాల ప్లాన్ చేసి అమలు చేయడం జరిగిందని తెలిపారు. ఇందులో భాగంగానే పోలీసు అధికారులు, క్రైమ్ డిటెక్షన్ బృందాలు క్రిమినల్ డేటాబేస్‌ను అప్‌డేట్ చేయడంతోపాటు వారి కదలికపై కార్యకలాపాలపై నిఘా ఉంచారన్నారు. ఇందులో భాగంగా గురువారం సిసిసి నస్పూర్ ఎస్సై రవికుమార్ తన సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా రాయల్ టాకీస్ చౌరస్తా, సిసిసి నస్పూర్ వద్ద నిందితున్ని గమనించారని, పోలీసులను గమనించిన నిందితుడు అనుమానాస్పద స్థితిలో ద్విచక్రవాహనంపై పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు నిందితుడిని పట్టుకొని క్షుణ్ణంగా విచారించగా గతంలో చేసిన నేరాలన్నింటినీ ఒప్పుకున్నాడని పేర్కొన్నారు. ప్రాథమిక విచారణలో నిందితుడిపై రెండు జిల్లాల్లో కలిపి దాదాపు 72 కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏడు(7), లక్సెట్టిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరు(6), చెన్నూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏడు(7), మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో(11), రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో(17), కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో(2) బంగారం దొంగతనాలు, శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో (01), మంచిర్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఐదు(5), గోదావరిఖని వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో(14), భీమారం పోలీస్‌స్టేషన్ పరిధిలో(2) దొంగతనాలు చేశాడని వివరించారు. నిందితుడు పోలీస్ వారి దృష్టిలో పడకుండా చాలా జాగ్రత్తలు తీసుకొన్నాడని, కానీ పోలీస్ వారి సమిష్టి ప్రయత్నాల వలన నిందితుడు దొరికాడని పేర్కొన్నారు. నిందితుడిని పట్టుకోవడానికి, కేసుల గుర్తింపులో నేర పరిశోధనలో సహకరించి చాకచకంగా వ్యవహరించిన మంచిర్యాల డీసీపీ సుధీర్ కేకన్ రామ్‌నాథ్, మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి, మంచిర్యాల రూరల్ సీఐ సంజీవ్, సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్, హాజీపూర్ ఎస్సై ఉదయ్ కిరణ్, ఏఎస్ఐ జితేందర్ సింగ్, కానిస్టేబుల్ తిరుపతి, శ్రీనివాస్, రవిలను సిపి అభినందించారు.

ఆకలితో అలమటించేవారు ఉండకూడదు

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్
- జాతీయ ఆహార భద్రత చట్టంపై సమీక్ష



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఆకలితో అలమటించేవారు ఉండకూడదని జాతీయ ఆహార భద్రతా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ రాజేశం, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి విజిలెన్స్ కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులతో జాతీయ ఆహార భద్రత చట్టం అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జాతీయ ఆహార భద్రత చట్టం అమలుపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. దారిద్రరేఖకు దిగువన ఉన్న ప్రజలకు బియ్యం, ఇతర సరుకులు అందించడం జరుగుతుందని, జిల్లాలో 1 లక్ష 39 వేల 920 ఆహార భద్రత కార్డుల ద్వారా లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని, అర్హులైన లబ్ధిదారులకు అంత్యోదయ, అన్నపూర్ణ కార్డుల బియ్యం పంపిణీ అవుతున్నాయని తెలిపారు. విజిలెన్స్ కమిటీలో ఉన్న సభ్యులు, అధికారులు చౌక ధరల దుకాణాల్లో డీలర్లు బియ్యం పంపిణీ చేసే సమయంలో తనిఖీలు నిర్వహించి ప్రజలకు అందుతున్న బియ్యం, సరుకులను పరిశీలించాలని తెలిపారు. పీడీఎస్ బియ్యం అక్రమంగా రవాణా జరగకుండా అందరూ కృషి చేయాలని, ప్రజలకు దగ్గరగా షాపులు ఏర్పాటు చేసి సరుకుల పంపిణీకి చర్యలు తీసుకోవాలని, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం కొరకు నాణ్యమైన సరుకులు పంపిణీ చేయాలని, సంబంధిత సిబ్బంది సరుకులు తూకంపై పర్యవేక్షించాలని తెలిపారు. ఆసిఫాబాద్ శాసనసభ్యులు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జిల్లాలోని మారుమూల గ్రామాలలో ప్రజల సౌకర్యార్థం చౌక ధరల దుకాణాల సంఖ్య పెంచాలని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. చనిపోయిన, పెళ్లి అయి వెళ్లిపోయిన వారి పేర్లను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని, ఆన్‌లైన్ పోర్టబుల్ సిస్టం ఉన్నందున జిల్లాలో ఎక్కడైనా బియ్యం తీసుకుని అవకాశముందని, లబ్ధిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ రాజేశ్వర్ పాల్గొన్నారు.

రేపు విస్తృత స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



డీవైఎఫ్ఐ జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని మార్చి 11న నిర్వహిస్తున్నట్టు ఈ సమావేశాన్ని విజవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తిక్ కోరారు. గురువారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎస్‌టీయూ భవన్‌లో సమావేశం ఉంటుందని తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీలను గుర్తించి తక్షణమే నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించే ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ వస్తున్నారని తెలిపారు. కరోనా మహమ్మరితో వివిధ ప్రైవేట్ రంగాలలో సుమారు 56 లక్షల మంది నిరుద్యోగ యువత ఉద్యోగాలు కోల్పోయి రోడ్డు మీద పడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం వివిధ ప్రభుత్వ రంగ సంస్థలలో సుమారు 10లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తెలిసి కూడా నేటి వరకు భర్తీ చేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. వివిధ పరిశ్రమలను ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించవలసిన మోడీ ప్రభుత్వం నేడు కార్పొరేట్ యాజమాన్యాలకు వత్తాసు పలుకుతూ నేడు నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. నిరుద్యోగ యువతకు బాసటగా నిలిచే విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బోర్కుటే శ్యామ్ రావ్, జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం రాజ్ కుమార్, జిల్లా ఉపధ్యక్షులు దుర్గం నిఖిల్, జిల్లా సహాయ కార్యదర్శి గెడం టికనంద్, జిల్లా కమిటీ సభ్యులు జాడి తిరుపతి పాల్గొన్నారు.

డ్రైవర్‌ను విధుల్లోకి తీసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్



శ్రీరాంపూర్ క్వాలిటీ జీఎం అకారణంగా తొలగించిన కన్వేన్స్ డ్రైవర్‌ను వీధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ బెల్లపల్లి రీజియన్ కార్యదర్శి దూలం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం జీఎం కార్యాలయం ఎదుట కార్మికులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాంపూర్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కన్వేయన్స్ డ్రైవర్ హుస్సేన్‌ను ఇంటి పనులు చేయడం లేదని, భార్య భర్తలు చెప్పిన పనులు చేయడం లేదని అకారణంగా విధుల నుండి తొలగించిన కార్మికుని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మిక సంఘం(సీఐటీయూ) ఆధ్వర్యంలో నిరవధిక రిలే దీక్ష ప్రారంభించడం జరిగిందని పేర్కొన్నారు. శ్రీరాంపూర్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న డ్రైవర్‌ను అకారణంగా విధులు నుండి తొలగించినందుకు మద్దతుగా నిరసన తెలిపిన కార్మికులపై, యూనియన్ నాయకులపై పోలీస్‌స్టేషన్‌లో క్వాలిటీ జీఎం తప్పుడు కేసులు పెట్టడమంటే ఇంతకంటే దుర్మార్గమైన చర్య ఇంకోటి లేదని మండిపడ్డారు. కేసులు విరమించుకొని డ్రైవర్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని లేకుంటే డ్రైవర్ల నుండి తీవ్ర నిరసనలు వ్యక్తం అవుతాయని దానికి పూర్తి బాధ్యత క్వాలిటీ జీఎం వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సింగరేణి చరిత్రలో ఇలాంటి సంఘటన మాయని మచ్చగా సింగరేణిలో మీగులుతుందని అన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టు కన్వేయన్స్ డ్రైవర్ల యూనియన్(సీఐటీయూ) డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు పెండం శివ, బండి తిరుపతి, హుస్సేన్, సతీష్, శ్రీకాంత్, అఖిల్, జియా, వినోద్, లక్ష్మణ్, విద్యాసాగర్, మహేష్, కిరణ్ పాల్గొన్నారు.

ఆటో టైరు పగిలి వ్యక్తి మృతి

జన్నారం : ఆటో టైరు పగిలి ఆటో మీద పడడంతో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన జన్నారం మండలం ఇందన్పల్లి శివారులో చోటుచేసుకుంది. ఇంధనపల్లి గ్రామ ఐబి వద్ద, ప్రధాన రహదారిపై గురువారం ఉట్నూర్ సొంత పనులుపై వెళ్లి పనులు ముగించుకొని ఆటోలో జన్నారం వస్తున్న క్రమంలో టైరు పగిలి చింతగూడ గ్రామానికి చెందిన బాలు నాయక్(56)పై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడని స్థానికులు తెలిపారు. మృతునికి భార్య సురాబాయి, కుమారులు వంశీ, పున్నం నాయక్‌లు ఉన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి కేసునుమోదు చేసినట్టు ఎస్సై పి.సతీష్ తెలిపారు.

నేడు చారిగాం పాఠశాల వార్షికోత్సవం

కాగజ్‌నగర్ రూరల్ : మండలంలోని చారిగాం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్టు ప్రధానోపాధ్యాయులు తాళ్లూరి ప్రభుదాస్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ సుందిల్ల రమేష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా జడ్పీ చైర్ పర్సన్ కోవలక్ష్మి, ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, ఆత్రం సక్కు, విశిష్ట అతిథులుగా ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ సహదేవ్, అడిషనల్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, డీఈఓ పార్సి అశోక్ హాజరు కానున్నారని తెలిపారు.

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలీసుల తనిఖీలు



నవతెలంగాణ-వేమనపల్లి

ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు చెన్నూర్ రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ విద్యాసాగర్, నీల్వాయి ఎస్సై నరేష్, కొటపల్లి ఎసై వెంకట్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని రాచర్ల, వెంచపల్లి గ్రామాల శివారులోని ఫెర్రీ పాయింట్స్, బ్రిడ్జ్ లను తనిఖీ చేసారు. అటవి ప్రాంతంలో టీఎస్ఎస్పీ సిబ్బంది, స్థానిక పోలీసులతో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఫెర్రి పాయింట్ల చెకింగ్, కల్వర్ట్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేసి అనుమానితుల ఆధార్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. సరైన వివరాలు తెలుపనటువంటి అనుమానస్పదంగా ఉన్న వ్యక్తులను విచారించి, వారి వేలిముద్రలను సేకరించి పరిశీలించారు. అదే విధంగా అనుమానిత వాహనాలను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్ మాట్లాడుతూ తరచుగా ఆకస్మిక తనిఖీలు, ఆర్ఓపీ ఏరియా డామినేషన్ నిర్వహించడం జరుగుతుందని, అదేవిధంగా మీ నివాస ప్రాంతాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానస్పదంగా కనిపించినట్లయితే స్థానిక పోలీస్‌లకు సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

మహిళా రైతుకు సుష్మా స్వరాజ్ అవార్డు



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని నాగసముద్రం గ్రామానికి చెందిన నందుర్క సుగుణ అనే మహిళ రైతుకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దివంగత బీజేపీ నేత సుష్మ స్వరాజ్ జాతీయ అవార్డును బుధవారం హైదరాబాదులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, తెలంగాణ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ మాలతి చేతుల మీదుగా అవార్డు ప్రధానం చేశారు. సుష్మా స్వరాజ్ అవార్డును స్థాపించి ప్రప్రథమంగా తెలంగాణలోనే అవార్డును ప్రధానం చేసినట్లు రైతు సుగుణ తెలిపారు. సేంద్రియ వ్యవసాయంలో కొత్త ఒరవడికి నాంది పలికినందుకుగాను వినూత్న పద్ధతులలో వ్యవసాయం చేస్తున్నందుకుగాను తనకు ఈ అవార్డు లభించడం చాలా సంతోషంగా ఉందని రాబోయే కాలంలో వ్యవసాయ రంగంలో నూతన ఒరవడులతో మరింత ముందుకు సాగుతానని ఆమె తెలిపారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సర్వేకు వినతి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

డబల్ బెడ్‌రూమ్ ఇండ్ల తప్పుడు సర్వేను ఖండిస్తూ గురువారం పట్టణ బీజేపీ నాయకులు మందమర్రి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షులు మహంకాళి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జంగంపెల్లి మల్లయ్యలు మాట్లాడుతూ అర్హులైన పేదవారికి ఇవ్వకుండా అధికార పార్టీకి చెందిన వ్యక్తుల పేర్లను జాబితాలో ప్రకటించడంతో నిజమైన అర్హులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గ ఎమ్మెల్యే బాల్క సుమన్ డబల్ బెడ్ రూమ్ ఇండ్ల విషయంలో నిజమైన పేద కుటుంబాలకు చెందిన వారికి మాత్రమే డబల్ బెడ్ రూమ్ ఇండ్లను అందిస్తామని దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని చెప్పిన సందర్భాలు లేక పోలేదని తెలిపారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే బాల్క సుమన్ స్పందించి నిజమైన పేద అర్హులకు డబల్ బెడ్ రూమ్‌లు అందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బీజేపీ నాయకులపై వ్యక్తిగతంగా దుర్భాషలాడిన విధానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వ్యక్తిగత ఆరోపణలు చేయడం చిల్లర రాజకీయ నాయకులకే చెందుతుందని తక్షణమే బీజేపీ నాయకులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఆరుముల పోశం, పట్టణ ఉపాధ్యక్షుడు సంఘ రవి, వైద్య శ్రీనివాస్, ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షులు బంగారు ప్రసాద్, రవి, పాల్గొన్నారు.

ప్రతిభగల విద్యార్థులకు అన్ని రకాల చేయూత

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు అన్ని రకాల చేయుత ప్రభుత్వం తరపున అందే ఏర్పాటు చేస్తామని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థి రేఖల తనుష్క, సాఫ్ట్ బేస్బాల్ ఆటలో అంతర్జాతీయ స్థాయి పోటీలకు భూటాన్ బయలుదేరనున్న సందర్భంలో జిల్లా కేంద్రంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిభ గల విద్యార్థులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. భారతదేశం తరపున మన జిల్లాకు చెందిన తనిష్క ఎంపిక కావడం గర్వకారణం అన్నారు. పట్టుదలతో కృషి చేసి అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను కనబరిచి, దేశానికి, రాష్ట్రంకు, మన జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్టడీ సర్కిల్ నిర్వాహకులు ఉషన్న, రాజశేఖర్, మేర సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి కార్తీక్, నాయకులు మురళి, అశోక్, సాయి పాల్గొన్నారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవ వేడుకలు



నవతెలంగాణ-కెరమెరి

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ భావాలను పంచుకున్నారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థులు చేసిన నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆసిఫాబాద్ కళాశాల ప్రిన్సిపాల్ రాందాస్, కెరమెరి కళాశాల ప్రిన్సిపాల్ పరశు రాములు, అధ్యాపకులు నవీన్‌రెడ్డి, రాజు, కుతుబ్, స్వామి, విమల్, శ్రీనివాస్, కిషోర్, శ్రీహరి, రాము, సునీల్ పాల్గొన్నారు.